


"కూడూ"

"కూ డూ"

"కుహూ"

"కుహూ"

"కుహ్ కుహ్ కుహ్ కుహ్ కూ"


"... కూ .... కూ ... కూ"

నీ గుండెను ప్రతిస్పదించే గుండె, నీ గుండె కూ అంటే కూ అనే గుండె ఎక్కడో ఒకచోట ఈ ప్రపంచంలో ఉండి తీరుతుంది.

ఆ గుండెను పట్టుకోవడంలోనే నీ జీవితం ఉంది. వదిలి పెట్టావా ఇక అంతే.

* * * * * *

శుభచైత్ర కాలేజీకి వెళ్తూ ఉంటే మొదటిసారిగా అతను రోడ్డు మీద కనిపించాడు.



కె.ఆదర్శ సామ్రాట్

# ఆ గుండెను పట్టుకో

భుజానికి సంచీ వేలాడేసుకుని, చెదిరిపోయిన జుత్తు నుదుటి మీద గాలికి కదులుతూ ఉంటే, ఏదో ఆలోచించుకుంటూ ఆమె ముందు నుంచే నిశ్శబ్దంగా వెళ్ళిపోయాడు. అతను తలవంచుకొని ఉండడం వల్ల కాబోలు ఒక నిమిషం వరకు పరీక్షగా అతన్నే గనించింది. ఎందుకో గాని ... ఆట బొమ్మ పారేసుకుని, దాని కోసం జాలిగా వెతుక్కుంటున్న ఒక పిల్లవాడు ఆమె మనసులో స్ఫురించాడు.

"ఎవరే అతను?" పక్కనే ఉన్న స్నేహితురాల్ని అడిగింది - తనలా కాకుండా ముందు నుంచి ఇక్కడే ఉండడం వల్ల ఆమెకు తెలిసి ఉండొచ్చు అన్న ఉద్దేశంతో.

"ఏం, బాగున్నాడా?" శర్మిల కొంటెగా అంది.

"షటప్. తెలిస్తే చెప్పు. లేకపోతే మానేయ్."

"అబ్బ. అంత కోపం తెచ్చుకోకే. స్మార్ట్‌గా ఉన్నాడు కాబట్టి అన్నాను. ఇంతకూ నీకు నచ్చాడా, లేదా?"

"అదిగో మళ్ళీ ... ఛీ నీతో మాట్లాడ్డం నాదే బుద్ధి తక్కువ."

శర్మిల పకపకా నవ్వింది. "శాంతించు, తల్లీ, శాంతించు. దేవుడి మీద ప్రమాణం చేసి అతని గురించి తెలిసిన దంతా నీకు చెబుతాను" అంటూ సినిమా ఫక్కీలో చెప్పడం మొదలు పెట్టింది.

"అత నో కవీశ్వరుడు. చిత్రకారుడు. శాంతి వికాస్ నామధేయుడు. ఎప్పుడూ అదోలా ఉండువాడు. ఎప్పుడో ఒకప్పుడు గాని మన లోకంలోకి రానివాడు. పార్కుల్లోను, స్టేషన్‌లలోను ఎక్కడ పడితే అక్కడ కూర్చుని దేని గురించో అదే పనిగా ఆలోచించువాడు. మొత్తానికి చాలా మంచివాడు."

"ఏం అతనికి ఇల్లు లేదా పాపం?"

"ఎందుకు లేదు పాపం? ఉండే ఉంటుంది పాపం. వెళ్దామా పాపం?"

"షటప్."

శర్మిల ముసి ముసిగా నవ్వుతూ మాట్లాడ్డం ఆపేసింది. ఈ లోగా కాలేజీ చేరుకున్నారు. తీరిక దొరికినప్పుడు మరోసారి శర్మిల మాటలు గుర్తుకొచ్చి ఆమె తనలో తాను నవ్వుకుంది. శర్మిల మరీ అల్లరిపిల్లై పోయింది.

వారం రోజుల తర్వాత అతను మళ్ళీ ఎదురయ్యాడు. చేతిలో ఏదో పెయింటింగ్ పట్టుకుని, నలిగి పోయిన బట్టలతో, షేవింగ్ లేని గడ్డంతో, నీరసంగా అడుగులు వేస్తున్న అతన్ని చూడగానే శుభచైత్ర మనసులో జాలి లాంటి భావం కదలాడింది. ఈసారి అచ్చం అత నొక పిల్లాడి లాగే కనిపించాడు. అతను దాటి వెళ్ళిపోతున్న సమయానికి ఒక నిట్టూర్పు లాంటి విశ్వాసం ఆమె నుంచి పైకి వచ్చింది.

"ఎందుకలా ఉంటా డతను?" శర్మిలను ప్రశ్నించింది.

"ఎలా ఉంటాడు?"

"ఏదో పోగొట్టు కున్నట్లు."

"అది నా కెలా తెలుస్తుంది?" మూడ్‌లో లేని శర్మిల ఉదాసీనంగా జవాబిచ్చింది.

కాలేజీకి వెళ్ళిందన్న మాటే గాని ఆ రోజు ఏ పాఠమూ ఆమె సరిగ్గా వినలేక పోయింది. మాటి మాటికీ అతని రూపం - ఆ జాలి గొల్పే రూపం - ఆమె మనసులో తిరగసాగింది. ఎలా గైతేనేం నిద్రపోయే వేళకి అన్నీ మరిచి పోయింది.

మూడోసారి అతను కనిపించే రోజు ఆమెకి చాలా తలనొప్పిగా ఉంది. అయినా కాలేజీకి బయలుదేరింది.

దూరంగా రోడ్డు మీదే నిలబడి ఎవరితోనో మాట్లాడుతున్న అతను కనిపించగానే చిత్రంగా ఆమె తలనెప్పి మాయమయ్యింది. ఎవరైనా చూస్తారన్న ఆలోచన అయినా లేకుండా తన చూపుల్ని అతని మీదే నిలిపి ఉంచేసింది.

అతన్ని సమీపించడం, దాటి పోవడం అన్నీ జరిగిపోయాయి. కాని దాటిపోయే ముందు క్షణంలో మాత్రం అతను నిండుగా నవ్వుతూ ఉన్న దృశ్యం కనిపించింది.

అది ఆమెని చూసి నవ్విన నవ్వు కాదు. అయినా ఆ నవ్వుని చూడగానే కారణం లేకుండా ఆమె మన సంతా సంతోషంతో నిండి పోయింది. ఉన్నట్లుండి అడుగుల వేగం పెరిగి పోయింది. ఇక ఆ రోజంతా ఆమె సంతోషంగానే ఉంది. నిద్ర పట్టే సమయంలో అతడు నవ్వుతూ ఉన్న వదనం మనసులో స్పష్టంగా కనిపించి సరిగ్గా అలాగే ఆమె కూడా నవ్వేసింది.

ఆ తర్వాత నెల రోజుల వరకు మళ్ళీ అతను కనిపించ లేదు. అతని గురించి ఆమె ఆలోచించ లేదు కూడా.

కాని .... రోడ్డు మీదకు వెళ్ళిన ప్రతిసారీ ఆమె కళ్ళు అనిశ్చితంగా అతని కోసం వెతుకుతున్నాయి. నడుస్తున్నప్పుడు ఆమె అంత పరధ్యానంగా ఎందుకుంటుందో శర్మిలకు అర్థం కాలేదు. పూర్తిగా కాకపోయినా శర్మిలకు టూకీగా అర్థమైన ఆ రోజు -

శుభ చైత్ర తల వంచుకుని నడుస్తూ ఉంది. మధ్యలో ఒక సారి తలెత్తినప్పుడు సరిగ్గా పదడుగుల దూరంలో అతను ఎదురొస్తూ కనిపించాడు.

అంతే. ఆమె గుండె గంటల్లా కొట్టు కోవడం మొదలు పెట్టింది. ఎప్పటి లాంటి అర్ధ నిమీలిత నేత్రాలతో ఆమెను చూడకుండానే అతను సాగిపోయాడు. కాలేజీకి చేరే వరకు ఆమె గుండె అలా కొట్టుకుంటునే ఉంది. కారణం లేని సంతోషం అణువణువూ వ్యాపించడం మొదలు పెట్టింది.

రెండు రోజులు తిరక్కుండా మళ్ళీ అతను కనిపించాడు. శుభచైత్ర అతని వైపే చూస్తూ ఉంది. అత నెందుకో దాటిపోయే ముందు హఠాత్తుగా కళ్ళెత్తి చూశాడు. అతని కళ్ళు నక్షత్రాల్లా స్వచ్ఛంగా మెరుస్తున్నాయి.

అదే మొదటిసారి వాళ్ళిద్దరి చూపులూ కలుసుకోవడం. ఆ చూపులు కలుసున్న మరుక్షణం ....

అతనే ముందుగా నవ్వాడో లేక ఆమె. నవ్వుకి జవాబుగా నవ్వాడో ..... మొత్తానికి ఇద్దరి వదనాల మీద అద్భుతమైన చిరునవ్వులు విరబూశాయి.

అతను వెళ్ళిపోయినప్పటికీ ఒక అర్థ నిమిషం వరకు ఆమె రోడ్డు మీదే ఆగిపోయింది. ఏ దో తెలీని సంతోషపు కెరటం జివ్వున చిమ్ముతున్నట్లు - ఆ జల్లులకు ఊపిరాడక ఉక్కిరి బిక్కిరౌతున్నట్లు శరీరం, మనసు అన్నీ గణగణమని అంటున్నట్లు - స్పష్టంగా చిత్రమైన అనుభూతి. విచిత్రమైన శాంతి ఏదో తనువంతా వ్యాపిస్తున్న అనుభూతి. మొత్తానికి ఏదో చల్లగా తడిపి పోయిన భావం.

ఆ రోజంతా ఆమె ఎన్నడూ లేనంత ఉత్సాహంగా ఉంది. డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నా పసి పిల్లలా కాలేజీలో పరుగు పెట్టింది. స్నేహితు లందర్నీ నవ్వులతో ముంచెత్తింది. ఆమె ఎవరితోనూ ఏమీ చెప్పకపోయినా - శర్మిలకు మాత్రం పూర్తిగా అర్థమైంది.

ఆ రాత్రి నిద్రలో..... తా నెక్కడో పూల వనంలో తిరుగుతున్నట్లు - పసిపాపలా తోటంతా పరిగెత్తుతున్నట్లు - ఆ తోటలోనే శాంతి వికాస్ నిలబడి నవ్వుతూ తన వైపు చూస్తున్నట్లు .... ఆమె కో అందమైన కల వచ్చింది.

నవ్వుతూ నిద్ర లేవగానే- "ఎక్క డెక్కడ తిరిగొచ్చారు దొరగారితో?" అంటూ శర్మిల నిలదీసింది.

"తిరిగి రావడం ఏమిటి? దొరగా రెవరు?" విస్మయంగా అడిగింది.

"ఎవరో తెలీకుండానే పాపం నిద్రలో వికాస్. వికాస్ అని కలవరిస్తున్నావా?" శర్మిల నవ్వుతూ అంది.

"అబద్ధం. నే నెవర్నీ కలవరించ లేదు. ఊరికే నన్ను ఉడికించాలని నువ్వు అంటున్నావు."

"అయితే మేలుకొనే పలవరిస్తున్నా వన్నమాట."

"యూ నాటీ." దిండు తీసి విసిరేసింది. శర్మిల పకపకా నవ్వుతూ తప్పించుకుంది.

బయటకు కోపాన్నైతే ప్రదర్శించింది కాని శర్మిల అలా అనడం ఆమెకు చాలా సంతోషాన్ని కలిగించింది.

ఆ రోజు ఆమె మనసంతా తియ్యగా తేనెలా మారిపోతున్న అనుభూతి కలిగింది. వికాస్ పేరు అనేకసార్లు ఆమె గుండెలో మధురంగా మోగిపోయింది.

ఆ తర్వాత చాలా రోజుల వరకూ అతను ఎదురైె నప్పుడల్లా కథ నవ్వులతో కొనసాగింది.

అద్భుతంగా నవ్వుతా డతను. ఆత్మీయంగా, అభిమానం వర్షించే కళ్ళతో మనోహరంగా ఉంటుం దతని నవ్వు. ఆ నవ్వు ఆమె గుండెలో జల్లున మోగిపోతుంది. మనసు నిండా సంతోషాన్ని నింపేస్తుంది. అనూహ్యమైన ఉల్లాసాన్ని రేకెత్తిస్తుంది. పలు సందర్భాలలోని అతని నవ్వులలో ఆమె అనేక భావాలు ఏరుకుంది.

"నేను అనుకుంటున్నాను - నువ్వు ఎదురొస్తావని" అన్నట్లున్న నవ్వు ఒకటి.

"నువ్వంటే నాకు చాలా ఇష్టం" అని చెప్పే నవ్వు ఒకటి.

"ఎక్సలెంట్. ఈ రోజు దేవతలా కనిపిస్తున్నావు." ప్రశంసించే నవ్వు ఒకటి.

"హాయ్ కొంటె పిల్లా. నీ మన సేమిటో నాకు తెలుసులే." సిగ్గు పరిచే నవ్వు ఒకటి.

"నే నంటే నీకు ఎంత ఇష్టమో నువ్వు కూడా నాకు అంతే ఇష్టం. అందుకే ఈ మధ్య ప్రతి రోజూ నేను ఎదురొస్తున్నాను. కేవలం నిన్ను చూడడం కోసం."

"ఐ లవ్ యూ చైత్రా ఐ లవ్ యూ!"

రకరకాల నవ్వుల్లో రకరకాల భావాలు. నవ్వుల్లో మన మనోభావాలు తెలియవూ.

"ఊ. ఈ కథ ఎప్పటికీ ఇక్కడే ఉంటుందా లేక ఏమైనా ముందుకు కదులుతుందా?" శర్మిల చిలిపిగా నిలదీసింది.

"ముందుకు కదలడం అంటే?" పసి గొంతుతో అంది శుభచైత్ర.

శర్మిల గలగలా నవ్వి "పిచ్చి మొద్దూ. ఐదు నెలల నుంచి చూస్తున్నాను. ఎంతసేపు ఆ నవ్వులతోనే మీ ఇద్దరికీ గడిచి పోతున్నట్లు ఉంది. అత నంటే అంత పడి చస్తున్నావు కదా. ఒక్కసారైనా అతన్ని పలకరించావా?" అంది.

"అతనే పలకరించ వచ్చుగా."

"అతను మూగ వాడేమో. పాపం మాటలు రావేమో. నీ కే మయ్యింది? మాట్లాడి మాట్లాడి మా అందర్నీ చంపుకు తింటావుగా. అతనితో ఓ రెండు మాటలు మాట్లాడ లేవూ?"

"మాట్లాడాలనే ఉంటుందే, కాని అతను కనిపించగానే మాటలు రాకుండా అయిపోతాను. అసలు మాట్లాడాలనే ఆలోచన కూడా మరిచిపోతాను."

"అదలాగే ఉంటుంది కాని నువ్వు మాత్రం రే పతనితో మాట్లాడాలి." శర్మిల నిక్కచ్చిగా అంది.

"ఏం మాట్లాడాలి?"

"ఇది మరీ బాగుంది. ఒక రొకరు ఇష్టపడుతుంది మీరు. మాట్లాడు కోవలసింది మీరు. ఏం మాట్లాడు కోవాలో నేను చెప్పాలా?"

"శర్మీ .... అతను ..... అతను నిజంగానే నన్ను ఇష్టపడుతున్నాడా?"

"వేరే చెప్పాలా. నిన్ను చూడగానే చంద్రబింబంలా వెలిగిపోయే ఆ మొహమే చెప్పేస్తుంది. అలాంటి అనుమానాలేం పెట్టుకోకు. రేపు మాత్రం ఎలాగైనా మాట్లాడు."

మరునాడు ఎప్పటి లాగే అతను ఎదురొచ్చి నిండైన నవ్వుతో వెళ్ళిపోతూ ఉంటే శుభచైత్ర ఊరుకుంది. శర్మిల సన్నగా గిల్లగానే మాట్లాడాలన్న సంగతి గుర్తు కొచ్చి వెనక్కి తిరిగి, మెల్లగా, వణుకుతున్న గొంతుతో పిలిచింది.

"వికాస్ గారూ!"

అతను టక్కున ఆగిపోయి, వెనక్కి తిరిగి, మరో అందమైన చిరు నవ్వుతో ముందుకొచ్చాడు.

"నా పేరు .... శుభచైత్ర." గొంతు పెగుల్చుకుని ఎలాగో అంది.

"తెలుసు. మీ ఫ్రెండు పేరు శర్మిల." నవ్వా డతను.

"అరె .... మీ కెలా తెలుసు?" విస్మయంగా అడిగింది.

"నా పేరు మీ కెలా తెలుసో మీ పేరూ నాకు అలాగే తెలుసు."

"అన్నట్లు మేం కాలేజీలో ..."

"డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నారు." తమాషాగా అన్నా డతను.

"అరె. మీకు మా గురించి అన్నీ తెలుసల్లే ఉందే?" బెరుకు కొంచెం తగ్గిపోయింది.

"అన్నీ కాదు లెండి. కొన్ని మాత్రమే. మీ రిద్దరూ మంచి మనసున్న అమ్మాయిలనీ, అందంగా ఉంటారనీ... అంత మాత్రమే తెలుసు."


ఆమె హార్టీగా నవ్వి "వస్తా మండీ" అంది.


అతను కూడా అలాగే నవ్వి "గుడ్ డే" అంటూ సాగిపోయాడు.

అప్పటి వరకూ శర్మిల మౌనంగానే ఉండిపోయింది.

శుభచైత్ర మన సంతా అనూహ్యమైన సంతోషం వ్యాపించింది. అతనితో మాట్లాడు తున్నంతసేపూ ఆమెకు పరిసరాలు, మనుషులు ఎవరూ కనిపించ లేదు. కనీసం శర్మిల కూడా. అతను వెళ్ళిపోగానే సిగ్గుపడే చిరునవ్వుతో శర్మిల వైపు చూసింది.

నడుం మీద చేతులు పెట్టుకుని 'బాగుంది మన నిర్వాకం' అన్నట్లుగా నిలబడిం దామె. ఆ తర్వాత కాలేజీకి వెళ్ళే వరకు - "నీ కసలు మాట్లాడ్డం వచ్చా? కనీసం ఒక అర్థపావు బుద్ధైనా ఉందా?" అంటూ తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతూనే ఉంది.






"ఏమోనే. అంతకు మించి ఇం కేమి మాటలు రాలేదు" అని ఆమె చెప్పినా వినిపించు కోలేదు. అయినా అతనితో మాట్లాడాలన్న సంతోషం ముందు శర్మిల తిట్లు కూడా పన్నీటి జల్లులుగా అనిపించాయి. నవ్వుతూ భరించింది.

ఈ సంఘటన తర్వాత పది రోజులకి కాని మళ్ళీ అతను కనిపించ లేదు. అప్పటికే కొత్త సంవత్సరం విచ్చేసి రెండు రోజులై పోతూంది.

"హేప్పీ న్యూ ఇయర్ శుభచైత్ర అండ్ శర్మిలా." నవ్వుతూ పల్కరించాడు.

"హేప్పీ న్యూ ఇయర్ సర్." ఇద్దరూ ఒకేసారి అన్నారు.

"నేను ఊళ్ళో లేను. లేకపోతే మొన్ననే కలిసే వాడిని." అంటూ సంచీ లోంచి కవరు తీసి అందిస్తూ- "గ్రీటింగ్స్" అన్నాడు.

"థాంక్యూ" అంటూ శుభచైత్ర అందుకుంది- తన కలాంటి ఆలోచన రానందుకు తిట్టుకుంటూ.

"వస్తాను" అంటూ అతను వెళ్ళిపోయాడు.

ఏదో అపు రూపమైన వస్తువు దొరికినట్లు కాలేజీ తోటలోకి వెళ్ళే వరకు ఆమె కవరు తెరవ లేదు. తెరిచి చూడగానే ఒక్క పెట్టున ఉధృతమైన కెరట మేదో ముంచేసినట్లుగా అనిపించింది.

అందమైన పూలతో మెరిసిపోతున్న గ్రీటింగ్. కుడివైపున ప్రింటెడ్ మేటర్ మీద "డియర్ ఫ్రెండ్స్" అంటూ తమ నిద్దరినీ సంబోధించి రాశాడు. ఎడమవైపున ప్రత్యేకంగా తన కోసమే రాసినట్లుగా పొందికైన అక్షరాలతో ఇలా రాశాడు.

"ఎవరి ఉనికి వల్ల ఈ ప్రపంచం ఆహ్లాద భరితంగా మారుతూ ఉందో, ఎవరి చిరునవ్వులు నీ లోకంలో బృందావనాలు సృజించగలవో, ఎవరి అద్భుతమైన గుండె స్పందనలు నీ గీతాన్ని ఇలపై ఆలపించ గలవో - హే భగవాన్!

అట్టి వారి నవ్వుల్ని శాశ్వతం చేయి
ఆ వ్యక్తుల జీవితాలు అమృతం చేయి
శుభచైత్రల సంతోషాలు అనంతం చేయి

ప్రేమతో
శాంతివికాస్."

ఆ మాటలు చదవగానే ఆమెక్కు ఏమిటో తెలీని ఉద్వేగం, ఆనందం ఆవహించాయి. రివ్వున కళ్ళల్లోకి కన్నీళ్ళు తోసుకొచ్చాయి. పట్టలేనంత ఆనందంతో శర్మిలను పట్టుకొని గాఢంగా ముద్దు పెట్టుకుంది.

"అబ్బ. వదలవే బాబూ, ఎవరైనా చూస్తే నువ్వు వికాస్‌ని కాకుండా నన్నే ప్రేమిస్తున్నావ్ అనుకుంటారు." అనేసరికి సిగ్గుతో మొగ్గలా అయిపోయింది.

ఆ రాత్రి నిద్రించే వరకు ఎన్నిసార్లు, ఎన్ని పదులసార్లు ఆ మాటల్ని చదువు కుందో లెక్క లేదు. అయినా ఇంకా చదవాలనే అనిపిస్తుంది. తియ్యని నది లాంటి దాంట్లో కొట్టుకు పోతున్నట్లుగా ఉంది. మనసంతా మాధుర్యం.

మరునాడు అతను మళ్ళీ కలిసినప్పుడు ఎన్నడూ లేనంతగా సిగ్గుతో కలసిన చిరునవ్వుతో ఆమె మొహం కమలంలా విరబూసింది. అతని చిరునవ్వులోనూ తృప్తి, ఆనందం కలబోసిన భావన. అతను వెళ్ళిపోగానే రోడ్డని కూడా చూడకుండా శర్మిలను గట్టిగా వాటేసుకుంది.

"కథ మంచి రసంలో పడింది కాని రేపు ఊరెళ్ళి నప్పుడు మీ అమ్మా నాన్నలకు చెప్పేయ్. వాళ్ళు కూడా సంతోషిస్తారు." ఆప్యాయంగా ముద్దు పెట్టుకుంటూ అంది శర్మిల.

"అలాగే."

రెండు రోజుల తర్వాత సంక్రాంతి సెలవులకు ఎవరి ఊరు వారు వెళ్ళిపోయారు.

* * * * * *

వారం రోజుల్లో తిరిగి రావాల్సిన శుభచైత్ర నెల దాటాక గాని తిరిగి రాలేదు. బాగా చిక్కిపోయి నీరసంగా అదోలా తయారైన స్నేహితురాలిని చూసి శర్మిల ఆశ్చర్యపోయింది.

"ఏం జరిగిందే?" సానుభూతిగా అడిగింది.

"వికాస్ గురించి మా ఇంట్లో చెప్పాను." జీవం లేని గొంతుతో శుభచైత్ర జవాబిచ్చింది.

"ఏమన్నారు?" ఆత్రతగా అడిగింది శర్మిల.

అదే జీవం లేని గొంతుతో శుభచైత్ర చెప్పింది. "అతను ఏం చేస్తున్నదీ, ఏం చదువుకున్నదీ అంతా చెప్పాను. అత నంటే నాకు ఇష్టమని, పెళ్ళి చేసుకుకోవా లనుకుంటున్నాననీ చెప్పాను. అంతా విని అలాంటి దిక్కుమాలిన వాడిని చేసుకోవాలనే ఆలోచన నీ కెలా వచ్చిందమ్మా? మే మంతా చచ్చిపోయా మనుకున్నావా లేక మేము నీ పెళ్ళి చేయలేమనుకున్నావా? అతనికి సరైన ఉద్యోగం లేదు. ఇల్లు లేదు. వాకిలి లేదు. నీ చైల్డిష్‌నెస్ కాకపోతే అలాంటి వాడితో ఎలా బ్రతుకు దా మనుకున్నావ్? పెళ్ళంటే ఏమన్నా తొలు బొమ్మ లాట అనుకున్నావా? నువ్వే ఆలోచించు. నెల నెలా స్థిరమైన జీతం కూడా రాని వ్యక్తితో నువ్వేలా బ్రతుకుదా, మనుకున్నావ్' అన్నారు నాన్న. ఈ నెల రోజులూ అదే చెప్పారు నాకు."

"ను వ్వే మన్నావ్?"

"ఏమీ అనలేదు కాని బాగా ఆలోచిస్తే నాన్న మాటల్లో నిజముంది అనిపించింది. సరైన ఆదాయం లేని మనిషితో సుఖంగా ఎలా బ్రతుకుతాం."

ఆమె జవాబుకి శర్మిల పిచ్చి పట్టినట్లుగా అరిచింది.

"ఏం, అతన్ని ప్రేమించినప్పుడు ఇవన్నీ నీకు గుర్తు రాలేదా? అతనికి సరైన ఉద్యోగం లేదనీ, డబ్బు లేదనీ - ఇవన్నీ నీకు తెలీనే తెలీదా? నీ చిరునవ్వులతో అతన్ని మభ్యపెట్టినప్పుడు, అతనిలో ఆశలు రేపినప్పుడు, అతన్ని ఆనంద పరిచినప్పుడు - అప్పు డివన్నీ నీకు గుర్తుకు రాలేదా? ఇప్పుడు పెళ్ళి దగ్గరికి వచ్చేసరికి అవన్నీ కావలసి వచ్చాయా? దగానే, శుబా, పచ్చి మోసం ఇది."

"ఇందులో మోసం ప్రసక్తి ఏముంది? నే నెప్పుడైనా అతనితో 'నిన్ను ప్రేమిస్తున్నాను' అని చెప్పానా? అతనితో కలసి సినిమాలకూ, షికార్లకూ వెళ్ళానా?' నువ్వు లేకుండా నేను బ్రతక లేను' అని ఉత్తరా లేమైనా అతనికి రాశానా? నా గురించి కలలు కనమని అతనితో అన్నానా? లేదే కనీసం మూడు సార్లైనా అతనితో మాట్లాడ లేదు. నేను మోసం చేసినట్లు ఎలా అవుతుంది?" కళ్ళ నీళ్ళు తిరుగుతుండగా రోషంగా అంది శుభచైత్ర.

శర్మిల మరింత రెచ్చి పోయింది.

"ఇదిగో దీన్నే ... దీన్నే అంటారే ఆత్మవంచన అని. చాలా మంది అమ్మాయిల్లాగే నువ్వు కూడా నీ చుట్టూ కోట కట్టు కుంటున్నావు. ఆ మాట కొస్తే అత నెప్పుడైనా అవన్నీ నీతో అన్నాడా? నీతో కలిసి సినిమాలకు, షికార్లకు వచ్చాడా? నువ్వు లేనిదే నేను బ్రతక లేను అని నీతో చెప్పాడా. అయినా అతను నిన్ను ప్రేమించాడు. మనసారా ప్రేమించాడు? నీకూ, నీ నవ్వులకూ పూర్తిగా స్పందించాడు. అతని వల్ల ను వ్వెంతగా స్పందించావో, నీ వల్ల అతనూ అంతగానే స్పందించాడు. ఇప్పు డిదంతా కాదని అతన్ని మోసం చేస్తావా?"

"ను వ్వేమన్నా అతని మనసులోకి దూరి చూశావా?" శుభచైత్ర ఉక్రోషంగా అంది.

శర్మిల దెబ్బ తింది. తన స్నేహితురాలు ఇలా మాట్లాడుతుందని ఆమె కలలో కూడా ఊహించ లేదు. అందుకే కసాయి వాణ్ణి చూస్తున్నట్లుగా చూస్తూ "తెలీదే చైత్రా. ప్రేమంటే ఏమిటో నీకు తెలీదు. తెలిస్తే నువ్విలా మాట్లాడే దానివి కాదు" అంది ఆవేదనగా.


"అవును నా కేమీ తెలీదు. డబ్బు మాత్రమే తెలుసు." వెక్కి వెక్కి ఏడుస్తూ శుభచైత్ర మంచం మీద వాలిపోయింది.

శర్మిల ఓదార్చ లేదు. మౌనంగా ఆలోచిస్తూ ఉండిపోయింది.

* * * * * *

నాలుగు రోజుల వరకు స్నేహితురా ళ్ళిద్దరికీ మాటల్లేకుండా అయిపోయాయి. కాలేజీకి కూడా వెళ్ళటం మానేసి ఇద్దరూ ఇంట్లోనే ఉండిపోయారు.

ఇక ఐదో రోజు భరించ లేక "ఏమే. నేనేం తప్పు చేశానని నాతో మాట్లాడ్డం మానేశావు?" అంటూ శుభచైత్ర చిన్న పిల్లలా ఏడ్చేసింది.



హిందూపూర్‌లోని 'మహా సర్ప' ఫోటో: పి.వి. శివకుమార్

"ఛ.ఛ. నీ మీద నా కేం కోపమే??" అంటూ శర్మిల దగ్గరకు తీసుకుంది.

ఇద్దరి మధ్యా మునుపటి సామీప్యం రాగానే శర్మిల మెల్లగా అంది-

"శుభా? నీ కో మాట చెప్పాలే."

"చెప్పు."

"కోపం తెచ్చు కోకూడదు."

"అలాగే." కొన్ని క్షణాలు మౌనంగా ఉండిపోయాక అంది.

"ఒకప్పుడు నేను కూడా సరిగ్గా నీ లాగే అనుకున్నానే. అఫ్‌కోర్స్ ఆడపిల్లలుగా మన మలా అనుకోవడంలో న్యాయం ఉంది" అంటూ శర్మిల మొదలు పెట్టింది.

"రెండేళ్ళ క్రితం ఒకబ్బాయి నన్ను ప్రేమించడం జరిగింది. అప్పటికి నువ్వింకా రాలేదులే. చాలా సున్నితంగా ఆ విషయాన్ని నాకు చెప్పా డతను. అత నంటే నాకు ఇష్టం ఉన్నప్పటికీ అంత దూరం నే నెప్పుడూ ఆలోచించ లేదు. అందుకే బాగా రెచ్చి పోయాను. 'నీ దగ్గర ఏముందని నన్ను ప్రేమించావు? నేను ఊ అంటే చాలు డాక్టర్లు, ఇంజనీర్లు లైన్లో నిలబడతారు. కనీసం నీ దగ్గర ఒక జత మంచి బట్టలైనా లేవే. ఏం చూసుకుని ఈ మాట అంటున్నావు నువ్వు? నన్ను ప్రేమించానని చెప్పడానికి ఎంత ధైర్యం నీకు?' అని చెడా మడా దులిపేశాను. ప్రేమంటే ఏమిటో తెలుసుంటే నా గొంతు కోసినా అలాంటి మాటలు అనే దాన్ని కాదు. నా మాటలకు అతను హర్టయ్యి 'క్షమించండి. ప్రేమించటానికి మనసుంటే చాలనుకున్నాను. ఇవన్నీ ఉండాలని తెలీదు నాకు. ఇప్పుడు తెలిసింది కాబట్టి ఇంకెప్పుడు మీ గురించి ఆలోచించను' అనేసి వెళ్ళిపోయాడు." ఆ తర్వాత మాటలు చెబుతున్నప్పుడు శర్మిల గొంతులో విషాదం జీరాడింది.

"తర్వాత తెలిసింది నాకు. ఉన్నపళంగా అతను ,చదువు మానేసి ఎంతో ఉదాసీనంగా, నిర్లిప్తంగా మారిపోయాడని. అయ్యో నా వల్లనే ఇలా అయిపోయాడు కదా అని చాలా బాధ పడ్డాను. నేను ప్రేమించినా, ప్రేమించక పోయినా అంత క్రూయెల్‌గా మాట్లాడకుండా ఉండ వలసింది. నా కలాంటి ఉద్దేశం లేదని సున్నితంగా చెప్పి, స్నేహితురాలిలా ఉండి పోవలసింది. కాని దెయ్యంలా ప్రవర్తించాను. అందుకే కొన్ని నెలల తర్వాత అతన్ని కలసి నా మాటలకు క్షమించమని, తన జీవితాన్ని బాగు పరుచుకోమనీ, ఒకవేళ నేను ప్రేమించడం వల్లే తన జీవితంలో బాగు పడుతుందంటే అందుకు కూడా నేను ఒప్పుకుంటాననీ అన్నాను. ఎందు కలా అన్నానో తెలీదు. కానీ అలాగే అన్నాను. అంతా విని అతను నవ్వి అన్నాడు కదా -

'శర్మిల గారూ ప్రే మనేది అడిగి తీసుకునేది కాదు. ఒకరు ప్రేమిస్తున్నారని జాలిపడి మొదలు పెట్టేది ప్రేమించడం కాదు. అతి సహజంగా పుట్టా లది. మన గుండె కూ అనగానే కూ అనేలా చేసేది ప్రేమ. అంతే గాని ఆస్తిపాస్తులు, కులగోత్రాలు, ఇతర స్థితిగతులు అన్నిటినీ చూసుకుని తేలికగా పుట్టేది ప్రేమ కాదు. ఒకే కాలంలో రెండు గుండెలు ఒకేలా స్పందించడం ప్రేమ. అలాంటి ప్రేమను మీ నుంచి పొంద లేక పోయినందుకు నేను బాధ పడ్డాను. అంతే గాని మీరు తిట్టారని కాదు. అదీ గాక నే నిప్పుడేమీ పతనమై పోలేదు. నా గుండె కూ అంటే కూ అనే గుండె, నా గుండెను స్పందింప చేసే గుండె, నన్నుగా ప్రేమించ గలిగే గుండె - అలాంటి గుండె నాకు ఈ ప్రపంచంలో దొరికినప్పుడు తప్పకుండా ఈ జీవితాన్ని మార్చుకుంటాను. నా కోసం కాకపోయినా నన్ను ప్రేమించే మనిషి కోసమైనా ఈ జీవితం మార్చుకుంటాను."

శర్మిల కొన్ని క్షణాలు ఆగి మళ్ళీ అంది.

"ప్రేమ గురించి అతని అభిప్రాయాలు ఏమైనప్పటికీ ఒక విషయం మాత్రం స్పష్టంగా తెలుసుకున్నాను. మనను ఎవరైనా ప్రేమించినప్పుడు లేదా ప్రేమిస్తున్నారని అనిపించినప్పుడు - మనలో అనూహ్యమైన మార్పు వస్తుంది. బ్రతుకు మీద ఉత్సాహం, ఆత్మవిశ్వాసం అన్నీ పెరుగుతుంటాయి. రాను రాను మనం బాగు పడడానికి ప్రయత్నిస్తుంటాము. ఈ మాట నిజమో, అబద్ధమో తేలడానికి ఒక చిన్న ఉదాహరణ ఇస్తాను - నువ్వు మొదట్లో చూసినప్పుడు వికాస్ ఎలా ఉండేవాడు? నలిగిన బట్టలతో, మాసిన గడ్డంతో ఒక పిచ్చాడ్లా ఉండేవాడు. అవునా? అదే వ్యక్తి ఇప్పుడు ఎలా మారిపోయాడు! నీట్‌గా, నిండుగా, పనసతొనలా తయారయ్యాడు. ఈ మార్పుకి కారణం ఏమిటో నువ్వెప్పుడైనా ఆలోచించావా? నీ ప్రేమ శాశ్వతంగా లభించినప్పుడు అతని జీవితం ఇంకా ఎంతగా మారిపోతుందో ఎప్పుడైనా ఊహించావా? ఆలోచించు చైత్రా. బాగా ఆలోచించు. ఇప్పుడు అతని జీవితం నాశనం చేసినా, బాగు పరిచినా అది నీ చేతుల్లో ఉంది."

స్నేహితురాలి మాటలకు అనుమానపు పొరలు తొలగుతున్నట్లై శుభచైత్ర ఆలోచించడం మొదలు పెట్టింది. అదీగాక తండ్రి కలిగించిన భయానికి లొంగిపోయి నెల రోజుల నుంచి వికాస్‌ని మరిచిపోవాలని ఎంతగా ప్రయత్నించినా ఆమెకు సాధ్యం పడడం లేదు. అతను గుర్తొస్తే చాలు మనసంతా ఏరులా మారిపోతుంది. - ఇది కూడా శుభచైత్ర ఆలోచించడానికి కారణమయ్యింది.

రెండు రోజుల తర్వాత -

పశ్చాత్తాపంతో, కన్నీళ్ళతో, ప్రేమతో వరదలా మారిపోయిన హృదయంతో శుభచైత్ర ఒక తెల్ల కాగితం మీద అదే పనిగా "ఐ లవ్ యూ వికాస్, ఐ లవ్ యూ" అని రాస్తుండడం చూసి శర్మిల కళ్ళు ఆనందంతో ఆర్ద్రమయ్యాయి.

ఆమె తన స్నేహితురాల్ని అద్వితీయంగా ఒప్పించింది. అయినా ... ఒకప్పుడు తనను ప్రేమించిన అబ్బాయి, ఇప్పుడు తను మూగగా ప్రేమిస్తున్న అబ్బాయి - ఆ శాంతి వికాసే అని మాత్రం శుభచైత్రకు చెప్ప లేదు.

ఇక ముందు చెప్పదు కూడా. ◆